AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
17-7-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

## అధ్వానంగా అంగన్‌వాడీల నిర్వహణ




2




## మత్స్యకారులకు అవగాహన సదస్సు

## ఓపెన్ ఇంటర్, ఓపెన్ టెన్త్ అడ్మిషన్లు ప్రారంభం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 2026 విద్యాసంవత్సరం నుంచి ఓపెన్ టెన్త్‌తో పాటు ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లను తీసుకుంటున్నట్లు కళాశాల ప్రిన్సిపల్, ఓపెన్ ఇంటర్, టెన్త్ కో–ఆర్డినేటర్ గంధం బుద్ధిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ ఇంటర్, రెగ్యులర్ టెన్త్ చేయలేని విద్యార్థిని, విద్యార్థులు ఓపెన్ ఇంటర్ ఓపెన్ టెన్త్ చదవాలనుకున్న వారు కళాశాల లోని అధ్యాపకుడు భాస్కర్(మ్యాథ్స్)ను సంప్రదించాలని సూచించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 9441018126 నంబరును సంప్రదించాలని పేర్కొన్నారు.





## జై జగన్నాథ్..





నిజామాబాద్ నగరంలో జగన్నాథ రథయాత్రను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కంఠేశ్వర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తజనం తరలివచ్చింది. 'జై జగన్నాథ్' నామస్మరణతో ఇందూరు పురవీధులు మార్మోగాయి. అందంగా తీర్చిదిద్దిన రథంపై కొలువుదీనిన జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవిల రూపాలను చూసిన భక్తులు తన్మయత్వం చెందారు. హరేకృష్ణ కీర్తనలు, భక్తినృత్యాల కోలాహలంతో నగరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. – అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్

## షాడో కౌన్సిలర్లు..

▸ సమావేశాలకు మాత్రమే అసలు కౌన్సిలర్ హాజరు ▸ పేరుకే మహిళా రిజర్వేషన్.. అమలులో శూన్యం

స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళా ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో గెలుపొందారు. మహిళా రిజర్వేషన్‌తో పాటు జనరల్ స్థానాల్లో మహిళలు పోటీ చేసి పురుషులతో సమానంగా పోటీకి దిగి విజయ బావుటా ఎగురవేశారు. ఎన్నికల్లో ప్రతివార్డులో నేనున్నా మీకు అని ఓటర్లకు భరోసా ఇచ్చిన సదరు మహిళా ప్రజాప్రతినిధులు గెలిచిన తర్వాత మాత్రం ప్రజల కళ్లకు కనిపించకుండా పోయారు. వారి స్థానంలో నేనే కౌన్సిలర్ అంటూ వారి భర్తలు, కొడుకులు దర్జాగా తిరుగుతూ పనులు చక్కబెడుతున్నారు.
- అక్షరటుడే, కామారెడ్డి




స్థానిక సంస్థల్లో మహిళలకు సమాన భాగస్వామ్యం కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం పూర్తిగా భిన్నంగా ఉంది. కాగితాలపై కౌన్సిలర్ పేరు ఒకరైతే, నిజంగా నిర్ణయాలు తీసుకునేది ఇంకొకరు అనే షాడో కౌన్సిలర్ వ్యవస్థ ఇక్కడ బలంగా వేళ్లూనుకుంది. కామారెడ్డి మున్సిపాలిటీలో మొత్తం 49 వార్డులు ఉన్నాయి. ఇందులో 23 మంది మహిళలే కౌన్సిలర్లుగా ఉన్నారు. అయితే స్థానిక సమస్యలపై మహిళా కౌన్సిలర్లకు అవగాహన శూన్యమని ప్రచారంలో ఉంది. సమావేశాలకు వెళ్ళినప్పుడు భర్తలు, తండ్రులు, తోబుట్టువులకు ఫోన్ చేసి ఏ విషయంపై అడగాలని సలహా తీసుకోవడం పరిపాటిగా మారుతోంది.

### వంటింటికే పరిమితమవుతున్న మహిళలు

ఎన్నికల సమయంలో ఇంటింటికి తిరిగి హామీలు ఇచ్చిన చాలా మంది మహిళా ప్రతినిధులు గెలిచిన తర్వాత మళ్లీ వంటింటికే పరిమితమయ్యారు. క్షేత్ర స్థాయి పర్యటనలు, ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, వార్డు సమస్యలపై ఫాలోఅప్ లాంటివి దాదాపుగా ఉండటం లేదు. గెలిచిన కౌన్సిలర్ ఫోన్ నంబర్ కేవలం మున్సిపల్ కార్యాలయంలో మాత్రమే ఉంటుంది. అక్కడ కూడా సగానికి పైగా కుటుంబ సభ్యుల పేర్లే ఉంటున్నాయి. దాంతో మహిళా కౌన్సిలర్లు ప్రజలకు నేరుగా అందుబాటులో లేకపోవడంతో చిన్న చిన్న సమస్యలు కూడా పెద్దవిగా మారుతున్నాయి.

### అవగాహనా లోపంతో ప్రజలకు నష్టం

కౌన్సిలర్లకు శిక్షణ కార్యక్రమాలు ప్రభుత్వం నిర్వహిస్తున్నా వాటికి హాజరయ్యేది చాలా తక్కువ మంది మాత్రమే. జీవోలు, పథకాల అర్హతలు, నిధుల వినియోగ విధానం తెలియకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులు సైతం సక్రమంగా వినియోగం కావడం లేదు.

### చర్యలు తీసుకుంటారా..?

స్థానిక సంస్థల్లో మహిళలకు ప్రాతినిధ్యం ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రిజర్వేషన్ కల్పించింది. అయితే మహిళా ప్రజాప్రతినిధులు ఎన్నికైనా.. వారి స్థానంలో భర్తలు, కుటుంబ సభ్యులు మున్సిపల్ కార్యాలయంలో తిష్ట వేస్తున్నారు. ఏ పనులున్నా వారే అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. అయితే ఎన్నికైన కౌన్సిలర్‌కు మాత్రమే మేం సమాధానం చెప్తాం అని ఖరాఖండిగా చెప్పలేకపోతున్నారు. ఫలితంగా షాడోల పెత్తనానికి అధికారులే కారణం అవుతుండడం గమనార్హం. ఇది ఒక్క కామారెడ్డికి మాత్రమే పరిమితం కాలేదు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో ఇదే పరిస్థితి నెలకొంది.

### మున్సిపాలిటీలో సమస్యలపై ఫిర్యాదులు ఇవ్వాలన్నా..

మున్సిపాలిటీలో ఏమైనా సమస్యలపై ఫిర్యాదులు చేయాలన్నా.. మహిళా కౌన్సిలర్ల తరపున వారి కుటుంబీకులే ముందుంటున్నారు. అలాగే మున్సిపల్ సాధారణ సమావేశాలు, స్టాండింగ్ కమిటీ సమావేశాలకు వెళ్లాల్సిన చాలామంది మహిళా కౌన్సిలర్లు కేవలం సంతకాలు పెట్టి 'హాజరయ్యాం' అని చెప్పుకోవడానికి మాత్రమే వెళ్తున్నారు. మిగతా సమయాల్లో వారిస్థానంలో భర్తలు, అన్నదమ్ములు, కొడుకులు, తండ్రులు హాజరై అధికారులను ప్రశ్నలు అడుగుతున్నారు. ఫైళ్లపై సంతకం పెట్టడానికి మాత్రమే అసలు కౌన్సిలర్ వస్తున్నారు. 'మేడం' పేరుతో గెలిచారు కానీ మాట్లాడేది, డెవలప్‌మెంట్ పనులు అడిగేది అంతా సారే అని వార్డు ప్రజలు పేర్కొంటున్నారు. దీంతో సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చ తగ్గి, వ్యక్తిగత ప్రయోజనాల చర్చకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.



## కామారెడ్డి పోలీసుల అద్భుత ప్రతిభ

**అక్షరటుడే, కామారెడ్డి :** రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ – 2026లో కామారెడ్డి జిల్లా పోలీసు క్రీడాకారులు అద్భుత ప్రతిభ చూపారు. హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి కమిషనరేట్ లో ఈనెల 7 నుంచి 9 వరకు క్రీడాపోటీలు జరిగాయి. జిల్లా తరపున బరిలో నిలిచిన ఐదుగురు సిబ్బంది ఒక స్వర్ణం, రెండు రజతాలు, మూడు కాంస్యాలతో కలిపి మొత్తం 6 పతకాలు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో పతక విజేతలను ఎస్పీ రాజేష్ చంద్ర సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు విధుల్లో సమర్థతతో పాటు క్రీడల్లోనూ రాణించడం ప్రతి సిబ్బందికి ఆదర్శమన్నారు. క్రీడలు శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, క్రమ శిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంచుతాయన్నారు. వుషూ 80 కేజీల విభాగంలో కామారెడ్డి పీఎస్‌కు చెందిన ఉత్తేజ్ స్వర్ణం, అదే విభాగం బాక్సింగ్‌లో రజతం సాధించారు. నిజాంసాగర్ ఠాణాకు చెందిన బాలరాజు రెజ్లింగ్ ఫ్రీ స్టైల్ 97 కేజీల్లో రజతం, డీఏఆర్ కామారెడ్డికి చెందిన జె.అంకోష్ రెజ్లింగ్ గ్రెకో రోమన్ 87 కేజీల్లో, ప్రభు గ్రెకో రోమన్ 97 కేజీల్లో కాంస్యం గెలుచుకున్నారు. సదాశివనగర్ ఠాణాకు చెందిన వినయ్ రెడ్డి కరాటేలో కాంస్య పతకం అందుకున్నారు.

## వాడీవేడిగా దిశ సమావేశం..




**అక్షరటుడే, కామారెడ్డి:** మూణ్నెళ్లకొకసారి నిర్వహించే దిశ సమావేశం వాడీవేడిగా సాగింది. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ అధ్యక్షతన ఈ మీటింగ్ నిర్వహించారు. శాఖల వారీగా సమీక్షలో అధికారుల పనితీరుపై చర్చ హాట్‌హాట్‌గా జరిగింది. వ్యవసాయ శాఖపై సమీక్ష సందర్భంగా రైతుల సమస్యలపై ప్రధానంగా చర్చించారు. రైతులకు క్రాప్ లోన్లు, రైతు భరోసా, రైతు బీమా అంశాలపై ఎమ్మెల్సీ అంజిరెడ్డి అధికారులను ప్రశ్నించారు. ఈనామ్ రిజిస్ట్రేషన్లు ఎంతవరకు పూర్తయ్యాయని ప్రశ్నించారు. జిల్లాలో ఇంప్రూవ్‌మెంట్ లేదని అధికారులు చెప్పడంతో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు వరి పంటకు బదులు ఆరుతడి పంటలు పండించేలా అవగాహన కల్పించాలని ఎంపీ సురేష్ షెట్కార్ అన్నారు. సమావేశానికి ముగ్గురు ఎమ్మెల్యేలు సమావేశానికి డుమ్మా కొట్టారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రావులు సమావేశానికి గైర్హాజరయ్యారు. ఈ సమావేశంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి పాల్గొన్నారు.



## ప్రజలతో మమేకమై గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** సర్పంచులు ప్రజలతో నిరంతరం మమేకమై గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం మాచారెడ్డి మండల కాంగ్రెస్ సర్పంచులతో సమావేశమయ్యారు. మాచారెడ్డి సర్పంచ్ సంతోష్ రెడ్డిని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడాన్ని అభినందించారు. బాధ్యతలను సమర్థంగా నిర్వహించి ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. ఈ సందర్భంగా మాచారెడ్డి మండలానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలను సర్పంచులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను సావధానంగా విన్న షబ్బీర్ అలీ సంబంధిత శాఖల అధికారులతో వెంటనే మాట్లాడి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ లోయపల్లి నర్సింగ్ రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నౌసిలాల్‌తో పాటు కేతావత్ కాంలు, కేలోత్ పద్మ స్వామి, మాలోత్ వసంత శివాల్, మాలోత్ సంతోష్, బానోత్ శ్రీరామ్, మాలోత్ రుక్కి చంద్రునాయక్, భూక్యా రాజవ్వ, మరుపాక అంజమ్మ లక్ష్మీరాజం, లావణ్య రాజకుమార్, అనిల్, బన్నీ, సంతోష్ రెడ్డి, లక్ష్మి మల్లారెడ్డి, మమత రమేష్ రెడ్డి, సునీత శంకర్, శిల రవికుమార్, మాన్ సింగ్, సదర్, శ్రీనివాస్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉసురు పోసుకుంటున్న రేవంత్‌రెడ్డికి పుట్టగతులుండవ్.. : అర్వింద్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించే కార్యక్రమం ఇందూరు నుంచే ప్రారంభమైందని.. విద్యార్థుల ఉసురు పోసుకుంటున్న రేవంత్‌రెడ్డికి పుట్టగతులుండవని ఎంపీ అర్వింద్ వ్యాఖ్యానించారు. నగరంలోని పాత కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇందూర్ రణభేరి' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందూరు గడ్డపైనే ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఆలోచన పుట్టిందన్నారు. 2004లో పీసీసీ చీఫ్ డీఎస్ అప్పటి కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఈ అంశాన్ని చేర్చారన్నారు. అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చాక అనేక మంది పేద విద్యార్థులు లబ్ధి పొందారన్నారు. ఈ పథకం పేద విద్యార్థులకు వరంగా మారిందని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ డేంజరస్ అయితే.. రేవంత్‌రెడ్డి డిజాస్టర్ అని ఎంపీ అర్వింద్ వ్యాఖ్యానించారు. యువ వికాసం పేరుతో ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు మేనిఫెస్టోలో చేర్చిందన్నారు.




రూ.12వేల కోట్ల బకాయిలు తీరుస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హామీని తుంగలో తొక్కిందన్నారు. రూ.12వేల కోట్లు బకాయిలు ఉంటే.. కంటితుడుపుగా రూ.200 కోట్లు విడుదల చేశారని.. అవి ఏ మూలకు సరిపోతాయో రేవంత్‌రెడ్డి చెప్పాలని ఎంపీ అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, రాష్ట్ర కార్యదర్శి స్రవంతిరెడ్డి, కార్యవర్గ సభ్యులు కంచెట్టి భూమన్న, మల్లికార్జున్ రెడ్డి, గద్దె భూమన్న, బీజేపీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో రెండు క్లినిక్‌లు సీజ్..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో రెండు క్లినిక్‌లను అధికారులు సీజ్ చేశారు. స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాలనుసారం డీఎంహెచ్‌వో రాజశ్రీ సూచనల మేరకు అధికారులు శుక్రవారం నగరంలోని వీక్లీ మార్కెట్‌లో ఉన్న చక్రవర్తి హాస్పిటల్, మాలపల్లిలోని హుడా ఫస్ట్ ఎయిడ్ క్లీనిక్‌లను సీజ్ చేశారు. ఎలాంటి అనుమతుల్లేకండా వీటిని నిర్వహిస్తున్నందున ఎఫ్ఐఆర్ నమోదైన కారణంగా సీజ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.



## బోధన్ ప్రభుత్వ ఆస్పత్రిలో పారిశుధ్యంపై కలెక్టర్ ఆగ్రహం

**అక్షరటుడే, బోధన్:** పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి పారిశుధ్యంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పారిశుధ్య కాంట్రాక్ట్ ఏజెన్సీకి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలోని అవుట్ పేషంట్ బ్లాక్, కాన్పుల విభాగం, ఇమ్యూనైజేషన్ గది, పోస్ట్ ఆపరేటివ్ వార్డ్ తదితర విభాగాలను కలెక్టర్ సందర్శించి అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణను, శిథిలావస్థకు చేరిన ఐసోలేషన్ వార్డు భవనాన్ని పరిశీలన జరిపారు. ఆస్పత్రి ఆవరణ.. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్య కాంట్రాక్ట్ ఏజెన్సీకి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. పరిస్థితిలో మార్పు రాకపోతే కాంట్రాక్టు రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్‌పర్సన్ కవితారెడ్డితో కలిసి బోధన్ ఆర్డీవో



విజయలక్ష్మి, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త శ్రీనివాస్ ప్రసాద్, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, ఇతర వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రి రికార్డులు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన బ్యాంకు స్టేట్‌మెంట్లను నిశితంగా పరిశీలించారు. ఆస్పత్రిలో నెలకొన్న ఇబ్బందుల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహశీల్దార్ విఠల్, స్థానిక వైద్యాధికారులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు అవగాహన సదస్సు



**అక్షరటుడే, మెండోరా:** మండలంలోని శ్రీరాం సాగర్ ప్రాజెక్టు జాతీయ చేపల ఉత్పత్తి కేంద్రంలో జిల్లా సహాయ మత్స్య శాఖ అధికారి (ఏడీ) నాగులు, మత్స్య అభివృద్ధి అధికారి (ఎఫ్‌డీవో) దామోదర్ ఆధ్వర్యంలో మత్స్యకారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, వృత్తి పనిముట్ల వినియోగం, జీవనోపాధి మెరుగుదలపై అధికారులు మత్స్యకారులకు వివరించారు. జిల్లా గంగపుత్ర నాయకుడు సోన్ నారాయణ మాట్లాడుతూ.. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుపై సుమారు 2,000 మంది మత్స్యకారులు కులవృత్తిగా ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వారికి అవసరమైన వృత్తి పనిముట్లను సకాలంలో అందజేస్తే వారి జీవనోపాధి మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు పాల్గొన్నారు.

## ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు సన్మానం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా ఇటీవల పదోన్నతిపై నియమితులైన అరుణ్ కుమార్‌ను 'టీఎన్జీవోస్ ఎక్సైజ్ సెంట్రల్ ఫోరమ్' ప్రతినిధులు, శాఖా సిబ్బంది ఘనంగా సత్కరించారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో టీఎన్జీవోస్ ఎక్సైజ్ సెంట్రల్ ఫోరమ్ కేంద్ర ఉపాధ్యక్షుడు అరుణ్ కుమార్, డీపీఈవో కార్యాలయ ఏఏవో నర్సయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని అసిస్టెంట్ కమిషనర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. శాఖాపరమైన లక్ష్యాలను విజయవంతంగా చేరుకోవడంలో సిబ్బంది అంతా ఎలాంటి రాజీలేకుండా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఫోరం మాజీ కార్యదర్శి శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్లు దేవేందర్, శేఖర్ రాజ్, రిజ్వాన్, సభ్యులు రాజు, నాగరాజు, రాణా, సబా, సాయిబాబా, సృజన తదితరులు పాల్గొన్నారు.

## రైతు లేనిదే రాజ్యం లేదు..




**అక్షరటుడే, కోటగిరి :** రైతు లేనిదే రాజ్యం లేదని బీజేపీ నాయకులు అన్నారు. కోటగిరిలోని బీజేపీ నాయకులు శుక్రవారం అంబేడ్కర్ చౌరస్తా నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు నిరసన కార్యక్రమం చేపట్టి తహశీల్దార్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు ఏముల నవీన్ మాట్లాడుతూ.. బాన్సువాడ నియోజకవర్గంలోని రైతులు బోర్లపై ఆధారపడి వేల ఎకరాల్లో నాట్లు వేశారన్నారు. వర్షాలు పడక భూగర్భ జలాలు అడుగంటి బోర్లన్ని ఎత్తిపోయి, మోటర్లు, కాలిపోతున్నాయన్నారు. దానికి తోడు సరైన సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల రైతులు పంటలను కాపాడుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో వెంటనే మాట్లాడి నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న 6 టీఎంసీల నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, పైడిమల లక్ష్మీనారాయణ, జిల్లా కౌన్సిలింగ్ మెంబర్ సాయిలు, రుద్రూర్ మండల అధ్యక్షులు, హరికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు శ్యామల, బీజేపీ నాయకులు ప్రకాష్ పటేల్, మోహన్, మక్కయ్య, నాగనాథ్, గంగాధర్, రవి, జగదీష్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించిన ముఠా అరెస్ట్..

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి ఇంటిని ఇతరుల పేరిట మార్చిన ముఠాను ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు మూడో టౌన్ ఎస్సై హరిబాబు వివరాలు వెల్లడించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మూడోటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రశేఖర్ కాలనీలో నివాసముండే మహిళ భర్త గతంలో మరణించాడు. అతడి పేరిట అదే కాలనీలో 50 గజాల స్థలంలో ఇల్లు ఉంది. భర్త మరణించిన అనంతరం ఆమె తన బంధువుల ఇళ్లలోనే ఉంటోంది. దీంతో ఖాళీ ఇంటిని గమనించిన ఇర్ఫాన్, సలీం, శివకుమార్, పోశెట్టి, శ్రీనివాస్ ఐదుగురు వ్యక్తులు కలిసి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. అనంతరం ఇతరుల పేరిట మార్చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సదరు బాధితురాలు మూడో టౌన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. అనంతరం ఈ ఐదుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.





# అధ్వానంగా

# అంగన్‌వాడీల నిర్వహణ

■ విద్యార్థులకు ఇబ్బందులు ■ అధికారుల పర్యవేక్షణ కరువు ■ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

**అంగన్‌వాడీలు అధ్వానంగా మారుతున్నాయి. పర్యవేక్షణ లేక ఆయా కేంద్రాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో చిన్నారులు అవస్థలు పడుతున్నారు. పెద్దకొడప్‌గల్ మండలంలో ఓ అంగన్‌వాడీని ఇంట్లోని యూరియా బస్తాలు ఉన్న గదిలో నిర్వహిస్తుండడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది.**

**- అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్**

మండలంలోని కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనాలు లేని చోట అద్దె భవనాల్లో వాటిని నిర్వహించాల్సి ఉండగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లలోనే కొనసాగిస్తుడడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. దీంతో చిన్నారుల భద్రత, పరిశుభ్రత, పౌష్టికాహార పంపిణీపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని మాన్‌సారం తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందించే పౌష్టికాహార పదార్థాలను వ్యవసాయానికి ఉపయోగించే యూరియా బస్తాలతో పాటు ఒకేచోట నిల్వ ఉంచుతున్నారని గ్రామస్థులు ఆరోపించారు.

### ఉన్నతాధికారులకు తెలిసినా..?

అంగన్‌వాడీ కేంద్రంలోనే యూరియా బస్తాలు, ఆహార పదార్థాలను ఒకేచోట ఉంచడం వల్ల చిన్నారుల ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అంగన్వాడీ టీచర్‌ను ప్రశ్నించగా.. 'ఈ విషయం అంగన్‌వాడీ సూపర్‌వైజ సూపర్వైజర్‌కు, ఎంపీడీవోకు తెలుసు' అని టీచరు సమాధానం ఇవ్వడంపై గ్రామస్థులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అంటే మండల స్థాయి అధికారులకు తెలిసినప్పటికీ చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.



### టీచర్లు రాకపోవడంతో..

మండలంలోని కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు సమయానికి హాజరు కావడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. కేంద్రాల్లో ఉదయం 10 గంటలైనా టీచర్లు రాక ఆయమ్మలు మాత్రమే అన్నీ చూసుకుంటున్నారు.. టీచర్లు సమయానికి రాకపోవడంతో చిన్నారులు సైతం ఎక్కువ సంఖ్యలో రావట్లేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. కొన్నిచోట్ల కేంద్రాల వద్ద ఎలాంటి రక్షణ చర్యలు లేకపోవడంతో కుక్కలు కేంద్రాల చుట్టూ తిరుగుతున్నాయని పేర్కొంటున్నారు. దీంతో చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఉన్నతాధికారులు వస్తేనే..

మండలంలో వారం రోజుల క్రితం బురుగుపల్లికి కలెక్టర్ సందర్శనకు వచ్చారు. ఈ సమాచారం తెలుసుకున్న సూపర్ వైజర్, సీడీపీవో అప్రమత్తమై కేంద్రాలను హడావుడిగా తనిఖీలు చేపట్టి సిబ్బందికి సలహాలు సూచనలు చేస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు. జిల్లాస్థాయి అధికారులు వస్తేనే తనిఖీలు చేస్తారే తప్ప మిగిలిన సమయాల్లో అంగన్‌వాడీలను పట్టించుకోరా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలపై నిఘా పెంచి సక్రమంగా సమయ పాలన పాటించే విధంగా కృషిచేయాలని కోరుతున్నారు.

## లింగంపేట ఉత్తర శబరిమలలో అయ్యప్పకు పూజలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** లింగంపేటలోని ప్రసిద్ధ ఉత్తర శబరిమల ఆలయాన్ని శుక్రవారం వేదమంత్రోచ్చరణల మధ్య తెరిచారు. అనంతరం అయ్యప్ప స్వామివారికి ఆచార్యులు ఉన్నికృష్ణన్ నంభూత్రి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రాల నడుమ ఉదయం గణపతి హోమంతో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం స్వామివారికి నెయ్యి అభిషేకం, ఉషఃపూజ, ఉచ్చపూజ, దీపారాధన నిర్వహించారు. భక్తుల సమర్పించిన పుష్పాలతో పుష్పాభిషేకం చేపట్టారు. సాయంత్రం అథంగ పూజ, మహానైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రత్యేక పూజలకు లింగంపేటతో పాటు కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాల నుంచి అయ్యప్ప భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామిని దర్శించుకున్నారు. 'స్వామియే శరణం అయ్యప్ప' నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. పూజల అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రవి గౌడ్, శ్రీకాంత్, కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. మండల ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 21 వరకు ఆలయం తెరిచి ఉంటుందని.. రాత్రి పదినెట్టెంబడి పడిపూజ నిర్వహించి ఆలయాన్ని మూసివేస్తామని ధర్మకర్త రవి గౌడ్ తెలిపారు. శబరిమల ఆలయంలో తెరుచుకునే సమావేశంలో ఇక్కడ కూడా కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

## పొలానికి నీళ్లు పారిస్తానని వెళ్లిన కౌలు రైతు మృతి



**అక్షరటుడే, బాన్సువాడ:** పొలానికి నీళ్లు పారిస్తానని వెళ్లిన రైతు మృతి చెందాడు. ఈ ఘటన పాత బాన్సువాడ లోని శాంతినగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత బాన్సువాడలోని శాంతినగర్ కాలనీకి చెందిన దేశాయిపేట్ నారాయణ (45) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గురువారం రాత్రి 10 గంటల సమయంలో నారాయణ తాను కౌలుకు చేస్తున్న పొలానికి నీరు పారించేందుకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం 7 గంటలైనా నారాయణ ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య సుజాత అతడి కోసం పొలం వద్దకు వెళ్లింది. ఉదయం సుమారు 8 గంటల సమయంలో పొలాల మధ్య ఉన్న మట్టి రోడ్డుపై నారాయణ మృతి చెంది ఉండడాన్ని ఆమె గుర్తించింది. ఈ విషయాన్ని వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాత్రి వరి పంటకు నీరు పారించి ఇంటికి తిరిగి వస్తుండగా, వర్షం కారణంగా బురదగా మారిన నల్లరేగడి రోడ్డుపై కాలు జారి బోర్లా పడడంతో బురద నీటిలో శ్వాస ఆడక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

## ఎస్ఐఆర్‌లో వెనకబడ్డ భీమ్‌గల్.. పరిస్థితిని సమీక్షించిన నగేష్ రెడ్డి



**అక్షరటుడే, భీమ్‌గల్:** ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి అన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భీమ్‌గల్ పట్టణం వెనుకబడిన నేపథ్యంలో ఆయన భీమ్‌గల్ పట్టణంలో పరిస్థితిని సమీక్షించారు. పట్టణంలోని మొదటి వార్డుతో పాటు 171వ పోలింగ్ బూత్ పరిధిలో ఇంటింటికీ తిరుగుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ సాగుతున్న తీరును ఆయన పరిశీలించారు. అనంతరం పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో నాగేష్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, అర్హులైన ప్రతిఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్, ఆరెపల్లి నాగేంద్ర, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, సంగ్యానాయక్, పర్స అనంతరావు, జేజే నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'దోస్త్' ప్రత్యేక విడత ప్రవేశాలు

**అక్షరటుడే, భీమ్‌గల్ :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 20 నుంచి 'దోస్త్' ప్రత్యేక విడత ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హెచ్ సతీష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరడానికి ఇది చివరి అవకాశమని, తెలంగాణ ప్రభుత్వం ఈ మేరకు ప్రత్యేక విడత నోటిఫికేషన్‌ను విడుదల చేసిందని పేర్కొన్నారు. కళాశాలలో బీఏ (హెచ్‌ఈపీ & కంప్యూటర్ అప్లికేషన్స్), బీకాం (కంప్యూటర్స్), బీఎస్సీ (ఎంపికేస్ & ఎంపీసీ), బీఎస్సీ (బీజెడ్‌సీ) గ్రూపుల్లో ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. అర్హులైన విద్యార్థులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రవేశాలకు సంబంధించిన ఇతర పూర్తి వివరాల కోసం 98492 78300 మొబైల్ నంబరులో సంప్రదించవచ్చని ప్రిన్సిపల్ సూచించారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన సబ్ కలెక్టర్

**అక్షరటుడే, అర్మూర్:** పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా శుక్రవారం సందర్శించి ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి అర్హుడైన ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు నమోదు, పేరు మార్పులు, సవరణలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. బూత్‌లలో అందుబాటులో ఉంచిన ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను, వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్మూర్ పట్టణంలోని 76, 63, 64వ పోలింగ్ కేంద్రాలను సబ్ కలెక్టర్ సందర్శించారు.



## కేజీబీవీ విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ

**అక్షరటుడే, ముప్కాల్:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ప్రభుత్వం అందించిన యూనిఫాంలను విద్యార్థినులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మొగలి గంగారం మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ జి.వినోద, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.